క్లుప్తంగా

ర్యాగింగ్‌కు పాల్పడితే చర్యలు

సిర్పూర్(టి): కళాశాలల్లో, పాఠశాలల్లో విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సిర్పూర్(టి) ఎస్సై డికొండ రమేశ్ హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ర్యాగింగ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీనియర్స్, జూనియర్స్ అనే తేడా లేకుండా స్నేహ పూర్వకంగా కలిసిమెలిసి ఉండాలని సూచించారు. గంజాయి, ఇతర మత్తు వ్యసనాలకు బానిసై విద్యార్థులు తమ విలువైన జీవితాన్ని నాశనం చేసుకోవద్దన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారులకు పెన్షన్ ఇవ్వాలి



మాట్లాడుతున్న మార్త సత్యనారాయణ

కాగజ్‌నగర్ రూరల్: తొలి, మలి దశ తెలంగాణ ఉద్యమకారులకు పెన్షన్‌తో పాటు సమర యోధుల హోదా ఇవ్వాలని 1969 తెలంగాణ ఉద్యమకారుల రాష్ట్ర ఉపాధ్యక్షుడు మార్త సత్యనారాయణ అన్నారు. గురువారం పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల కార్యాలయంలో మాట్లాడారు. ఉద్యమకారులు అనేక విధాలుగా నష్టపోయారని, వారిని ఆదుకోవాలని కోరారు. పెన్షన్, సమరయోధుల హోదా, వారి పిల్లలకు రిజర్వేషన్, డబుల్‌బెడ్ రూం ఇళ్లు మంజూరు చేయాలన్నారు. సమావేశంలో నాయకులు రమణయ్య, ఎఎస్ఆర్ మూర్తి, నాగేశ్వర్‌రావు, లక్ష్మీనారాయణ, కోటేశ్వర్‌రావు, ఫారూక్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్‌కు సన్మానం



విజయలక్ష్మిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్‌రూరల్: ఆసిఫాబాద్ మండలం గుండి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం జాతీయ ఉత్తమ అవార్డుకు ఎంపికైన నేపథ్యంలో జిల్లా కేంద్రంలో గురువారం అంగన్‌వాడీ టీచర్ విజయలక్ష్మిని ఎమ్మెల్యే కోవ లక్ష్మి సన్మానించారు. ఉత్తమ అవార్డు రావడం సంతోషకరంగా ఉందన్నారు. ఈ నెల 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఢిల్లీలో అవార్డు అందుకోనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్, అంగన్‌వాడీ టీచర్లు సువర్ణ, వనిత తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

పెంచికల్‌పేట్: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పెంచికల్‌పేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి అర్షిన్ అన్నారు. మండలంలోని కొండపల్లి, లోడుపల్లి గ్రామాల్లో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 106 మందిని పరీక్షించి మందులు పంపిణీ చేశారు. ఇంటి పరిసరాల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఎంపీడీవో అల్బర్ట్, సీహెచ్‌వో హల్దార్, ఎల్‌టీ నాగరాజు, హెచ్ఏ ధర్మారావు, ఏఎన్ఎం సావిత్రి పాల్గొన్నారు.

క్రైస్తవులకు రక్షణ కల్పించాలి

కౌటాల: క్రైస్తవుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలని సిర్పూర్(టి) నియోజకవర్గ పాస్టర్స్ సంఘం ఉపాధ్యక్షుడు ఆర్ శ్రీనివాస్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. క్రైస్తవులపై దాడులు పెరుగుతున్నాయని, ప్రభుత్వం క్రైస్తవులకు రక్షణ కల్పించాలన్నారు. క్రైస్తవుల సంక్షేమం కోసం ప్రభుత్వం సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టాలన్నారు. అనంతరం సిర్పూర్ పాస్టర్స్ కార్యవర్గం ఎన్నుకున్నారు. సంఘం గౌరవ అధ్యక్షుడిగా విల్‌ఫేడ్, ఐజాక్ రామచంద్ర నాయక్, తిమోతి జయరాజు, అధ్యక్షుడిగా కూచిపుడి ఏసుకుమార్, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా మూర్తి, సంయుక్త కార్యదర్శిగా ఫిలిప్ సత్తిబాబు, కోశాధికారిగా జాకబ్ మాదాసు, సలహాదారులుగా కృపానందం, జాన్ ప్రకాశ్‌రావు, సువార్త రాజన్న, యోహానులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కిరాణంలో చోరీ

ఆసిఫాబాద్‌రూరల్: కిరాణ దుకాణంలో దొంగలు పడిన ఘటన మండలంలోని బూర్గుడలో బుధవారం చోటు చేసుకుంది. షాపు యాజమాని శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. బూర్గుడలో బీసీ కాలనికి చెందిన శ్రీనివాస్ జాతీయ రహదారి రహపల్లి రోడ్డుకు పక్కన కిరాణ దుకాణం ఏర్పాటు చేసుకున్నాడు. రోజు వారిగా రాత్రి 9 గంటలకు షెటర్ వేసి ఇంటికి వెళ్లారు. రాత్రి దొంగలు షెటర్ తాళం పగలకొట్టి నగదు రూ. 1 వేయి, మద్యం బాటిలు తీసుకెళ్లినట్లు తెలిపారు. ఎస్సై ప్రవీణ్ ఘటన స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

నాగుల పంచమికి ఏర్పాట్లు

- పాము పుట్టల్లో పాలు పోయడం ఆనవాయితీ
- గ్రామీణ ప్రాంతాల్లో అధిక ప్రాధాన్యత



పాము పుట్టలో పాలు పోస్తున్న భక్తులు (ఫైల్)

కెరమెరి(ఆసిఫాబాద్): శ్రావణ శుక్లపంచమి నాగారాధనకు శ్రేష్ఠమని గ్రామీణులు విశ్వసిస్తారు. అందుకే ఇతర పండులాగే నాగపంచమిని జరుపుకుంటారు. భారతీయ సంప్రదాయాల్లో మనుషులకు, నాగులకు అధిక ప్రాధాన్యత ఉంది. మహిళలు పాము పుట్టల్లో పాలు పోసి తమ భక్తిని చాటుకుంటారు. నవధాన్యాలతో తయారు చేసిన పుట్నాలను నైవేద్యంగా సమర్పిస్తారు. ఈపర్వదిన్నాన్ని పురస్కరించుకుని ఉమ్మడి జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల ప్రజలు నాగుల పంచమిని జరుపుకునేందుకు సర్వం సిద్ధం చేశారు. ఇప్పటి నుంచే ఉయ్యాలలు ఊగేందుకు ఏర్పాటు చేశారు.

ఇది కథ..

జనమే జయుడి తండ్రి పరీక్షిత్తు, నాగరాజు వల్ల మరణిస్తాడు. ఆయనపై ప్రతీకారం తీర్చుకునేందుకు జనమే జయుడు సర్పయాగం చేస్తాడు. ఈయగంలో మంత్ర శక్తి ద్వారా నాగులను రప్పించి యజ్ఞ గుండంలో ఆహుతి చేస్తాడు. జనమేజయుడి సర్పయాగంలో కోట్లాది నాగులు భస్మమై పోతాయి. మనసా దేవి కుమారుడు హస్తికముని యజ్ఞాన్ని నిరోధిస్తాడు. నాగయజ్ఞం అయిపోయిన రోజునే పంచమ తిథి కావడం వల్ల నాగులకు పంచమ తిథి ఆనందదాయకమైంది. ఓం నమఃశివయ.. ఓం నమఃశివయ.. నాగేంద్రహరాయ ఓం నమోఃశివయ అనే నాగ గాయత్రి తొలిమంత్రం వల్ల, శివమంత్రం పఠించడం వల్ల శుభప్రదమైన ఫలితం లభిస్తుందని శాస్త్రావచనం.

నాగరాజుకి నైవేద్యాలు...

శ్రావణ శుద్ద చతుర్థశినాడు మహిళలు ఉపవాసం, ఆచార మంత్రోపచారాలతో, జాజా సంపెంగ పుష్పాలతో భక్తిశ్రద్ధలతో పూజించి పుట్టలో పాలు, పాయసము, కలివిడి, పప్పు, వడ, నువ్వులతో చేసిన ఉండలు, క్షీరాన్నం నాగేంద్రుడికి సమర్పిస్తే సర్వదోషాలు హరిస్తాడని సంతానంలో అవరోధాలు లేకుండా చూస్తాడని భక్తుల విశ్వాసం. సర్పదోష నివారణకు నాగచవితి, నాగపంచమి నాడు నాగదేవతను ఆరాధిస్తే కాల సర్పదోషం, రాహుగ్రహ దోషం తొలుగుతాయని పురాణాలు చెబుతున్నాయి.

నాగవ్రతంతో మేలు..

నాగపంచమి నాడు శాస్త్రోక్తంగా ఈ వ్రతాన్ని ఆచరిస్తే సంతానం కలుగుతుందని, అన్ని కార్యాలు సులభంగా జరుగుతాయని ప్రజల నమ్మకం . స్త్రీ పురుష జాతకంలో సర్పదోశం ఉంటే వారు శుద్ధపంచమి నాడు నాగవ్రతాన్ని ఆచరించి ప్రతీ నెల శుక్ల పంచమికి ఈ వ్రతం చేయడం వల్ల సకల ప్రాప్తి కలుగుతుందని ప్రతీక. నవధాన్యాలతో పుట్నాలను చేసి తియ్యటి పరమాన్నంతో పాటు పాలను పుట్టలో పోయడంతో అంతా శుభం జరుగుతుందని భక్తుల విశ్వాసం.

ఉత్సాహంగా వేడుక



నాగ పంచమిని గ్రామాల్లో ఎంతో ఉత్సాహంగా జరుపుకుంటాం. ఉదయాన్నే ఇల్లంతా శుభ్రం చేసి నూతన వస్త్రాలు ధరిస్తాం. నవధాన్యాలతో పుట్నాలను తయారు చేసి, పుట్టలో పాలు పోస్తాం. భక్తిశ్రద్ధలతో నాగరాజును ఆరాధిస్తాము. – గిత్తే అల్కా, కెరమెరి

విద్యార్థుల్లోని నైపుణ్యాలను వెలికితీయాలి

- డీఈవో అశోక్



మాట్లాడుతున్న డీఈవో అశోక్

ఆసిఫాబాద్‌రూరల్: విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీయాలని డీఈవో అశోక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం సైన్స్ ఉపాధ్యాయులకు ఇన్‌స్పైర్ ఓరియెంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. డీఈవో మాట్లాడుతూ జిల్లాలో 6 నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థుల ఇన్‌స్పైర్ నామినేషన్లు ఈ నెల 25లోగా పూర్తి చేయాలన్నారు. విద్యార్థులు తమ చుట్టూ నెలకొన్న సమస్యలను గుర్తించి, వాటిని పరిష్కరించేలా ప్రాజెక్టులు రూపొందించాలని సూచించారు. ఎంపికైన ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం రూ.10వేల ప్రోత్సాహక నగదు అందిస్తుందని తెలిపారు. ప్రతీ పాఠశాల నుంచి ఐదు నామినేషన్లు వేయాల్సిన బాధ్యత ప్రధానోపాధ్యాయులు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి మధుకర్, రిసోర్స్‌పర్సన్లు తిరుపతయ్య, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఐడియా బాక్సులు ఏర్పాటు చేయాలి

కాగజ్‌నగర్‌రూరల్: జిల్లాలోని ప్రతీ పాఠశాలలో ఐడియా బాక్సులు ఏర్పాటు చేయాలని జిల్లా సైన్స్ అధికారి కటుకం మధుకర్ అన్నారు. పట్టణంలోని డీఆర్‌సీ భవనంలో ప్రభుత్వ ఉపాధ్యాయులకు గురువారం ఇన్‌స్పైర్ ఓరియెంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇన్‌స్పైర్ నామినేషన్ల ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్లు మామిడాల తిరుపతయ్య, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత



మొక్క నాటుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

సిర్పూర్(టి): మొక్కల సంరక్షణ అందరి బాధ్యత అని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. మండల కేంద్రంలోని సమాఖ్య కార్యాలయ ఆవరణలో గురువారం మొక్కలు నాటారు. అనంతరం మండల సమాఖ్య సంఘాల సభ్యులతో సమావేశమయ్యారు. వారితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలు వివరించి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో సత్యనారాయణ, ఏపీఎం దుర్గయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలతోనే మానవ మనుగడ

కెరమెరి: మొక్కలతోనే మానవ మనుగడ సాధ్యమని జెడ్పీ సీఈవో లక్ష్మినారాయణ అన్నారు. గురువారం మండలంలోని చౌపన్‌గూడ, ఝరి, కెస్లాగూడ గ్రామాల్లో స్వచ్ఛదనం.. పచ్చదనం కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సెగ్రిగేషన్ షెడ్లను పరిశీలించి, ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని సూచించారు. పారిశుధ్యంపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో అంజద్‌పాషా, ఎంఎన్‌వో అడే ప్రకాశ్, ఈజీఎస్ ఏపీవో మల్లయ్య, ఈసీ ఐక్యా నాయక్ పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న జీఎంకు సన్మానం



జీఎం రవిప్రసాద్‌ను సన్మానిస్తున్న అధికారులు

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్‌గా విధులు నిర్వర్తించి బదిలీపై వెళ్తున్న రవి ప్రసాద్‌ను గురువారం గోలేటి లోని జీఎం కార్యాలయంలో కార్మిక సంఘాల నాయకులు, ఏరియా సింగరేణి అధికారులు వేర్వేరుగా సన్మానించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. బెల్లంపల్లి ఏరియా అభివృద్ధితో పాటు కార్మిక సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ఏరియా ఉత్పత్తి లక్ష్యసాధనకు జీఎం ఎంతో కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమాల్లో ఎస్‌వోటూజీఎం నరేందర్, పీవోలు సత్యనారాయణ, ఉమాకాంత్, సీఎంవోఏ అధ్యక్షుడు మధుసూదన్, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, అధికారులు పాల్గొన్నారు.

పీవోకు సన్మానం..

కైరిగూడ ఓసీపీ ప్రాజెక్టు అధికారిగా పని చేస్తూ శ్రీరాంపూర్ ఏరియా ఎస్‌వోటూజీఎంగా బదిలీపై వెళ్తున్న సత్యనారాయణను గురువారం ఓసీపీ ఆవరణలో అధికారులతో పాటు కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు ఘనంగా సన్మానించారు. శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందచేశారు. కార్యక్రమంలో మేనేజర్ ప్రవీణ్ ఫాటింగ్, వెల్ఫేర్ అధికారి వేణు, మధుసూదన్, ఏఐటీయూసీ ఫిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



సమ్మె చేస్తున్న పంచాయతీ కార్మికులు

కౌటాల: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట గురువారం కార్మికులు సమ్మె చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. పంచాయతీ సిబ్బంది పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని, కార్మికులను క్రమబద్ధీకరించాలన్నారు. పంచాయతీ సిబ్బంది, కార్మికులకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు మోరేశ్వర్, నగేశ్, ప్రకాశ్, రవి, రాజారం , బానిత్, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులను రెగ్యులర్ చేయాలి

బెజ్జూర్: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల మేరకు పంచాయతీ కార్మికులను రెగ్యులర్ చేయాలని సీఐటీయూ మండల అధ్యక్షుడు గోరంట్ల వసంత్ డిమాండ్ చేశారు. గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో బెజ్జూర్ మండల కేంద్రంలో తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయడంతో పాటు కారోబార్, బిల్ కలెక్టర్లను సహాయ కార్యదర్శిగా నియమించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో బెజ్జూర్ గ్రామ పంచాయతీ కార్మికులు లట్కారీ రంగయ్య, ఎండీ అజీజ్, సుధాకర్, వాగయ్య, శంకర్, భాస్కర్ పాల్గొన్నారు.

దహెగాం: మండలంలోని పంచాయతీ కార్మికులు స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట గురువారం ఒక రోజు సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు రమేశ్ మాట్లాడుతూ.. మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని పూర్తిగా రద్దు చేయాలన్నారు. 60 జీవో ప్రకారం వేతనాలు చెల్లించాలని ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు ప్రభాకర్, రవీందర్, జీపీ కార్మికులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ రూరల్: గ్రామ పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేసి కనీస వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్ అన్నారు. గురువారం తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్, వర్కర్స్ అసోసియేషన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పంచాయతీ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కారోబార్, బిల్ కలెక్టర్లను సహాయ కార్యదర్శులుగా నియమించాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రమేశ్, విజయ్, మహేశ్, రాజేశ్, సురేశ్, రమేశ్, మధు, సుధాకర్ పాల్గొన్నారు.

వికాసం పుస్తకాల పంపిణీ



పుస్తకాలు అందిస్తున్న హెచ్‌ఎం సదానందం

రెబ్బెన: మండలంలోని నవేగాం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం రూం టూ రీడ్ సంస్థ ఇచ్చిన వికాసం- 1, 2 పుస్తకాలను విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బత్తుల సదానందం పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూం టూ రీడ్ సంస్థ అందచేసిన పుస్తకాలు ఎస్ఏఎస్ తెలుగు పరీక్షకి అనుగుణంగా ఉన్నాయన్నారు. పిల్లలు చిత్రాలను చూసి పదాలను చెప్పగలుగుతారని, దానితో పాటు తను నేర్చుకున్న అక్షరాలను, పదాలను సులువుగా గుర్తుపెట్టుకునేందుకు, దారళంగా చదవటానికి ఎంతో ఉపయోగపడుతున్నాయన్నారు. ప్రతీ విద్యార్థికి రూం టూ రీడ్ సంస్థ బొమ్మలతో కూడిన కథల పుస్తకాలను అందించటం ద్వారా విద్యార్థుల్లో పఠనాశక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనాన్ని పెంపొందించాలి

పెంచికల్‌పేట్: విద్యార్థుల్లో పుస్తక పఠనాన్ని పెంపొందించాలని పెంచికల్‌పేట్ కాంప్లెక్స్ హెచ్‌ఎం విజయ నిర్మల అన్నారు. మండల కేంద్రంలోని సంజీవనగర్ ప్రాథమిక పాఠశాలలో గురువారం రూం టూ రీడ్ కార్యక్రమంలో భాగంగా ఒకటోవ, రెండోవ తరగతి విద్యార్థులకు వికాసం-1, వికాసం-2 పుస్తకాలను పంపిణీ చేశారు. కథల పుస్తకాలను కూడా ఖాళీ సమయాల్లో విద్యార్థులు చదివేలా నిర్దేశం చేయాలని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ప్రియాంక, ఉపాధ్యాయుడు సతీష్, రూం టూ రీడ్ ప్రతినిధి వెంకన్న పాల్గొన్నారు.

కౌటాల: మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు గురువారం రూం టు రీడ్ ఇండియా ట్రస్ట్ ఆధ్వర్యంలో పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు సంపత్ మాట్లాడుతూ.. విద్యార్థులకు ఈ పుస్తకాలతో అక్షర గుర్తింపు, ధ్వని గుర్తింపు, పఠన శక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు నారాయణ్ సింగ్, గణపతి, తదితరులు పాల్గొన్నారు.

ఓబీసీ మోర్చా కో ఇన్‌చార్జిగా వెంకటేశం

కాగజ్‌నగర్‌రూరల్: మంచిర్యాల జిల్లా బీజేపీ ఓబీసీ మోర్చా కో ఇన్‌చార్జిగా కాగజ్‌నగర్‌కు చెందిన గోలెం వెంకటేశం నియమితులయ్యారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు లక్ష్మణ్, రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్, ఎంపీ నగేశ్, సిర్పూర్ ఎమ్మెల్యే హరీశ్‌బాబుకు వెంకటేశం కృతజ్ఞతలు తెలిపారు.

ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవాలి

కౌటాల: జిల్లాలోని ఆదివాసీ గ్రామాల్లో శుక్రవారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవాలని డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కుమురం మాంతయ్య, ఆదివాసీ మన్నెవార్ కొలవార్ సేవ సంఘం జిల్లా అధ్యక్షుడు డబ్బా బాపు గురువారం అన్నారు. ఏజెన్సీ గ్రామాల్లో జెండా ఎగురవేయాలన్నారు. ఆదివాసీలందరూ ఐక్యమంతంగా ఉండి తమ హక్కుల సాధనకు కృషి చేయాలన్నారు. కౌటాల మండల కేంద్రంలోని కుమురం భీం చౌరస్తాలో ఆదివాసీ దినోత్సవ వేడుకలను నిర్వహిస్తామని, నాయకులు, ఉద్యోగులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

నూతన కార్యవర్గం

దహెగాం: మండల పంచాయతీ కార్యదర్శుల నూతన కార్యవర్గాన్ని గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చౌదరి రాజేశ్, ప్రధాన కార్యదర్శిగా రోహిదాస్, ఉపాధ్యక్షుడిగా దుర్గం సునీత, విజయ్, ట్రెజరి రఘు కుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పల్లెలను పరిశుభ్రంగా ఉంచాలి



మాట్లాడుతున్న అధికారులు

కౌటాల: పల్లెలను పరిశుభ్రంగా ఉంచాలని డీఆర్‌డీవో బానోతు దత్తారావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. స్వచ్ఛదనం.. పచ్చదనం కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని, సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. స్థానిక ఐకేపీ కార్యాలయంలో మహిళా సంఘాల సభ్యులతో మాట్లాడారు. స్వయం ఉపాధితో అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కోట ప్రసాద్, ఎంపీవో మహేందర్‌రెడ్డి, ఏపీఎం ముక్తేశ్వర్, ఏపీవో పూర్ణిమ పాల్గొన్నారు.

టోల్‌ప్లాజా అధికారుల నిర్వాహకం

- అధికంగా ఫాస్టాగ్ డబ్బులు కట్
- నష్టపోతున్న వాహనదారులు

ఆసిఫాబాద్: జాతీయ రహదారి టోల్‌ప్లాజా వద్ద ఫాస్టాగ్‌లో నిర్ణీత డబ్బుల కంటే అధికంగా కట్ అవడంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. మంచిర్యాల- ఆసిఫాబాద్ వెళ్లే జాతీయ రహదారి మార్గంలో మందమర్రి వద్ద ఏర్పాటు చేసిన టోల్ ప్లాజా వద్ద అప్ అండ్ డౌన్‌లో ఒకే విధంగా డబ్బులు కట్ అవడంతో వాహనదారులు నష్టపోతున్నారు. ఆసిఫాబాద్‌కు చెందిన కావ్లె దత్తు ఈనెల 7న మంచిర్యాలకు కారులో వెళ్లగా వెళ్లే సమయంలో రూ. 90 రూపాయలు కట్ అవగా.. అదే రోజు సాయంత్రం తిరిగి వస్తుండగా మళ్లీ రూ. 90 అకౌంట్ నుంచి కట్ అయినట్లు మెసెజ్ వచ్చింది. వాస్తవంగా తిరుగు ప్రయాణంలో రూ. 45 కట్ కావాల్సి ఉంది. దీనిపై సదరు వాహనదారుడు టోల్ ఫ్రీ 1033కి కాల్ చేయగా, దీనిపై ఐసీఐసీఐ బ్యాంకు సిబ్బందిని సంప్రదించాలని సమాధానం ఇచ్చినట్లు వాహనదారుడు వాపోతున్నాడు. రహదారిపై ప్రతీ రోజూ వందలాది వాహనాలు వెళ్తుండగా.. ఇష్టారీతిలో టోల్ డబ్బులు కట్ అవడంతో వాహనదారులు నష్టపోతున్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

‘అక్రమ కేసులతో ఆర్ఎంపీ ఆత్మహత్య’

సిర్పూర్(టి): గద్వాల జిల్లాలోని జమ్మిచేడుకు చెందిన ఆర్ఎంపీ వైద్యుడిపై అక్రమంగా పెట్టిన కేసుకు తన ప్రాణాలు కోల్పోయాడని సిర్పూర్(టి) మండల ఆర్ఎంపీ సంఘం నాయకుడు తులసీదాస్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గతంలో ఆర్ఎంపీ వృత్తిపై అక్రమ కేసులు నమోదు చేయగా భార్య పిల్లలను పోషించుకునేందుకు వేరే వృత్తి లేక ఆత్మహత్యకు పాల్పడ్డాడని అన్నారు. రూ. 50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. సమావేశంలో ఆర్ఎంపీ వైద్యుడు అబ్రార్ అహ్మద్, లక్ష్మణ్, రజ్జబ్ అలీ, షాకిర్, రఘునాథ్ పాల్గొన్నారు.

11న గద్దర్ సంస్మరణ సభ



మాట్లాడుతున్న రాజయ్య

కాగజ్‌నగర్‌రూరల్: ప్రజా యుద్ధనౌక గద్దర్ ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని ఈ నెల 11న గద్దర్ సంస్మరణ సభ నిర్వహిస్తున్నట్లు సంస్మరణ సభ ఆహ్వాన కమిటీ కన్వీనర్ అల్లి రాజయ్య తెలిపారు. పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో గురువారం ఆయన మాట్లాడారు. పట్టణంలోని సంతోష్ ఫంక్షన్‌హాల్‌లో ఈ నెల 11న నిర్వహించే సంస్మరణ సభకు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సభకు ప్రధాన వక్తలుగా ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ చింతకింది కాశీం, తెలంగాణ ధూంధాం వ్యవస్థాపకుడు అంతడుపుల నాగరాజు, సామాజిక ఉద్యమకారుడు సుందిళ్ల రాజన్న హాజరవుతారని తెలిపారు. సమావేశంలో ఆహ్వాన కమిటీ సభ్యులు ముంజం ఆనంద్‌కుమార్, ఎం.రాజకమలాకర్ రెడ్డి, జాడి కేశవ్, బావండ్లపల్లి నర్సయ్య, శివప్రసాద్ నాయర్, నాగేశ్వర్‌రావు, ఎఎస్ఆర్ మూర్తి, రమేశ్, పురుషోత్తం, మొండయ్య, సునీల్, మురారి తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ఆవిష్కరణకు తరలిరండి



తహసీల్దార్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న నాయకులు

పెంచికల్‌పేట్: మండలంలోని జిల్లెడ గ్రామంలో కుమురంభీం విగ్రహ ఆవిష్కరణకు మండలంలోని ఆదివాసీలు పెద్ద ఎత్తున తరలిరావాలని భీం విగ్రహ ఆవిష్కరణ కమిటీ నాయకులు గురువారం పిలుపునిచ్చారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా మండలంలోని ప్రతీ గ్రామంలో ఆదివాసీ జెండా ఎగురవేసి సంబురాలు జరుపుకోవాలన్నారు. అంతకు ముందు పెంచికల్‌పేట్ తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు, ఎస్సై కొమురయ్యకు ఆదివాసీ సంఘాల నాయకులు విగ్రహవిష్కరణ ఆహ్వాన పత్రికలు అందచేశారు. ఆదివాసీల సంఘాల నాయకులు మధుకర్, ప్రభాకర్, శంకర్, సకరాం, సిడాం అశోక్ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



రేషన్ బియ్యం ఆటోతో పోలీసులు

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని రైల్వేస్టేషన్ నుంచి మహారాష్ట్రకు అక్రమంగా ఆటోలో తరలిస్తున్న రేషన్ బియ్యంను గురువారం సిర్పూర్(టి) ఎస్సై డికొండ రమేశ్ పట్టుకున్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. రేషన్ బియ్యం అక్రమ రవాణపై పక్కా సమాచారం మేరకు రైల్వే సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిర్పూర్(టి) పోలీసులు రైల్వేస్టేషన్‌తో పాటు పరిసర ప్రాంతాల్లో తనిఖీ చేయడం జరిగిందన్నారు. మండల కేంద్రానికి చెందిన అబ్దుల్ జాకిర్ అనే వ్యక్తి ఆటోలో తనిఖీ చేయగా.. నాలుగు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నామన్నారు. పట్టుకున్న రేషన్ బియ్యాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించి, ఇద్దరిపై కేసు నమోదు చేశామన్నారు.